## • ట్రాఫిక్ మార్షల్స్



సిటీబ్యూరో, జూలై 29 (నమస్తే తెలంగాణ): రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు సైబరాబాద్ పోలీసులు దేశంలోనే తొలిసారిగా ట్రాఫిక్ మార్షల్స్‌ను రంగంలోకి దింపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు వీరు సహకరిస్తున్నారు. ఐటీ కంపెనీల సహకారంతో ఎంపిక చేసిన వారికి ట్రాఫిక్ నియమాలు, చట్టాలపై పూర్తి స్థాయి అవగాహన, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం 83 మంది ట్రాఫిక్ మార్షల్స్ సేవలందిస్తున్నారు. ఈనెల 12న విధుల్లోకి చేరిన వీరు.. ప్రధానంగా ఐటీ కారిడార్‌లోని బాటిల్‌నెక్, అత్యంత రద్దీగా ఉండే జంక్షన్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి వివిధ ఐటీ కంపెనీల సహకారంతో గౌరవ వేతనం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, మంగళవారం 30 జూలై 2024 | HYDERABAD




నగరంలో బోనాల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో నగర పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, అదనపు సీపీలు విక్రమ్ సింగ్‌మాన్, విశ్వప్రసాద్, స్థానిక డీసీపీ స్నేహామెహ్రా తదితరులు లాల్ దర్వాజ సింహవాహిని ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.
-సిటీబ్యూరో, జూలై 29 (నమస్తే తెలంగాణ)

# హైడ్రాను రద్దు చేయండి

## బదులుగా మున్సిపాలిటీలకు నిధులను పెంచండి

- అధికారులకు మరిన్ని అధికారాలివ్వండి
- మూసీ సుందరీకరణ ఎలా చేస్తారో చెప్పండి
- రాయదుర్గం-ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దు అవివేకం
- ఎస్ఎన్‌డీపీ, ఎస్ఆర్‌డీపీలను కొనసాగించాలి
- అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పేరిట ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న హైడ్రా విధానంతో గ్రేటర్ హైదరాబాద్ నగర అభివృద్ధి, శివారు మున్సిపాలిటీలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ డిమాండ్ చేశారు. రాజీవ్‌గాంధీ పాలన వికేంద్రీకరణతో స్థానిక సంస్థలకు అధికారాలను బదలాయిస్తే, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు అందుకు విరుద్ధంగా కేంద్రీకరణ విధానాలను అమలు చేసేందుకు పూనుకున్నదని నిప్పులు చెరిగారు. పోలీస్, ఎక్సైజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, బీసీ వెల్ఫేర్ తదితర శాఖలకు సంబంధించిన బడ్జెట్ పద్దులపై అసెంబ్లీలో సోమవారం జరిగిన చర్చలో బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌లో విపత్తుల నిర్వహణ తదితర అంశాలపై గత ప్రభుత్వం రూపొందించి అమలు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం) విధానానికి బదులుగా కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్స్ మానిటరింగ్, ప్రొటెక్షన్ (హైడ్రా) తీసుకురావడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వం అధికారాల వికేంద్రీకరణకు పూనుకోకుండా హైడ్రా పేరిట కేంద్రీకరణకు పాల్పడుతున్నదని ధ్వజమెత్తారు. హైడ్రాను అమలు చేస్తే జీహెచ్ఎంసీలోని 17 మున్సిపాల్టీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఇకపై ప్రతి పనికీ జీహెచ్ఎంసీకే రావాల్సి ఉంటుందని హెచ్చరించారు. 2007లో జీహెచ్ఎంసీగా ఏర్పాటు చేసినప్పుడు ఎదురైన ఇబ్బందులను గుర్తుచేశారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం 2016లో మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని, ఇప్పుడిప్పుడే సమస్యలన్నీ తొలగిపోయి పాలన సజావుగా కొనసాగుతున్నదని వెల్లడించారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇప్పుడు హైడ్రా పేరిట అధికార కేంద్రీకరణకు కుట్ర పన్నిందని తూర్పారబట్టారు. ఆస్తుల రక్షణ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కోసమైతే ఈవీడీఎంకే అందుకు సంబంధించిన అధికారాలను కట్టబెట్టాలని, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు అదనంగా నిధులు కేటాయించి మరింత బలోపేతం చేయాలని, అధికారులకు నిర్ణయాధికారాలను బదలాయించాలన్నారు. అలా కాకుండా హైడ్రాను తీసుకొస్తామంటే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. అదీగాక న్యాయవివాదాలు అనేకం వస్తాయని వెల్లడించారు.




### ఇకనైనా నిద్రలేచి.. అభివృద్ధిపై దృష్టిపెట్టండి

ప్రభుత్వం ఏర్పడి 8నెలలు గడిచిపోయిందని, హనీమూన్ పిరియడ్ ముగిసిందని, ఇకనైనా నిద్రలేచి అభివృద్ధిపై దృష్టిపెట్టాలని ఎమ్మెల్యే చురకలంటించారు. మూసీ సుందరీకరణకు సంబంధించిన డీపీఆర్‌ను అందజేయాలని, ఎప్పటిలోగా పూర్తిచేస్తారో చెప్పాలని, మాస్టర్‌ప్లాన్‌ను వెల్లడించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వరదల ముంపునకు పరిష్కారంలో భాగంగా ఎస్ఎన్‌డీపీని చేపట్టిందని, ఇప్పటికే చాలా పనులు పూర్తయ్యాయని, కొన్ని చోట్ల పనులు పెండింగ్ ఉన్నాయని, వాటిని సత్వరమే పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా ఎస్ఎన్‌డీపీ ఫేజ్ -2ను కూడా ప్రారంభించాలని కోరారు. ట్రాఫిక్ సమస్య నివారణకు గత ప్రభుత్వం అమలు చేసిన ఎస్ఆర్‌డీపీ పాలసీని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ తాగునీటి అవసరాల రీత్యా సుంకిశాలను సత్వరమే పూర్తిచేయాలని, అందుకు అదనంగా నిధులు కేటాయించాలని సూచించారు. లక్షలాది మందికి ఉపయోగకరమైన రాయదుర్గం-ఎయిర్‌పోర్ట్ మెట్రో కనెక్టివిటీని రద్దు చేయడం అవివేకమని నిప్పులు చెరిగారు. కొందరి భూముల రక్షణ కోసమే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. వెంటనే ఆ ప్రాజెక్టును చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో ఏమాత్రం అభివృద్ధి జరగలేదని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే వివేకానంద్ తీవ్రంగా ఖండించారు. పదేండ్లలో ఎన్నో అవార్డులను తీసుకొచ్చామని, వంతెనలను నిర్మించామని గుర్తుచేశారు. మాజీ మంత్రి కేటీఆర్ సారథ్యంలో పదేండ్ల కాలంలో ఒక్క ఐటీ రంగంలోనే దాదాపు 6 లక్షల ఉద్యోగాలను సృష్టించామని గుర్తుచేశారు. ఇకనైనా విమర్శలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవుపలికారు.

## గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్‌కు సంక్షేమ నిధి ఏదీ?

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



సిటీబ్యూరో: గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్‌కు సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టారని, వారికి వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో లావాదేవీలో పాయింట్ 5 లేక పాయింట్ 25 శాతం వారికి లభించేలా చేస్తే ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫార్మాసిటీని ముచ్చెర్లలోనే ఏర్పాటు చేయాలని, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్‌కు చేయుతనివ్వాలని కోరారు. గత ఏడాది పరిశ్రమలకు రూ. 1400కోట్లు ప్రోత్సాహకాలు ఇస్తే, ఈసారి కేవలం రూ. 500కోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టారని, వీటిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గచ్చిబౌలి ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయిందని, గతంలో మంత్రిగా కేటీఆర్ ప్రవేశపెట్టిన లుక్ ఈస్ట్ పాలసీని అమలు చేయాలని, ఇందులో భాగంగా నగర తూర్పు ప్రాంతంలో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యేలను పట్టించుకోవడం లేదని, తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. తన తల్లికి మోకాలి ఆపరేషన్ అయినందున ఆమె కోసం వీల్‌చైర్ ఏర్పాటు చేయాలని తాను ముందస్తు సమాచారం ఇచ్చినా ఎయిర్‌పోర్టు సిబ్బంది పట్టించుకోలేదని, సెక్యూరిటీ క్లియరెన్స్ అయ్యాక చెప్పండి అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆయన సభ దృష్టికి తెచ్చారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్టులో 13 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ఉన్నప్పటికీ ఇక్కడి ఎమ్మెల్యేల పట్ల వారు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. కంకర మిషన్లు రావడం వల్ల వడ్డెర కమ్యూనిటీ తమ ఉపాధిని కోల్పోయిందని, వారిని డీఎంఎఫ్ ఫండ్ నుంచి ఆదుకోవాలన్నారు. అలాగే, కుమ్మర కమ్యూనిటీని ఆదుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో మట్టి పాత్రలను, మట్టి కప్పులను ప్రోత్సహించాలని సూచించారు.



ప్రతి పోలీస్‌స్టేషన్‌కు నెలవారీ మామూళ్లు
పది అయ్యిందంటే పేదలపై లాఠీలు
పగలు నిద్రపోతున్న టాస్క్‌ఫోర్స్
కమిషనరేట్ కార్యాలయం ముందు.. 12 గంటల వరకు హోటల్
గల్లీలో మాత్రం 10 గంటలకే మూత..
అసెంబ్లీలో ప్రభుత్వంపై విరుచుకుపడిన ఎంఐఎం శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ

## ఫ్రెండ్లీ కాదు.. ఫెయిల్యూర్ పోలీసింగ్

### హైదరాబాద్‌లో అధ్వానంగా శాంతి భద్రతలు

సిటీబ్యూరో, జూలై 29 (నమస్తే తెలంగాణ): 'శాంతి భద్రతల పరిరక్షణలో హైదరాబాద్ పోలీసులు ఫెయిలయ్యారు.. ప్రతి పోలీస్ స్టేషన్‌కు మామూళ్లు వస్తున్నాయి.. నేరస్తులను పట్టుకోవాల్సిన టాస్క్‌ఫోర్స్ సామాన్యులపై లాఠీలు ఝుళిపిస్తున్నది. గంజాయి, డ్రగ్స్‌ను ఆపాలనుకుంటే ఒక్కరోజులోనే పోలీసులు ఆపేయగలరు.. కానీ ఆ పని చేయడం లేదు' అంటూ ఎంఐఎం శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ సోమవారం అసెంబ్లీలో ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా ఆయన హైదరాబాద్‌లో శాంతి భద్రతల పరిస్థితిని కండ్లకు కట్టినట్లు వివరించారు. రాత్రి పది అయ్యిందంటే పేదలు, సామాన్యులు ఉండే చోట పోలీసులు లాఠీలతో కొడుతున్నారని, అదే బంజారాహిల్స్‌లోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ముందు 12 గంటల వరకు తెరిచి ఉండే బడాబాబుల నిలోఫర్ హోటల్ మాత్రం హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు కన్పించడం లేదా? అని ప్రశ్నించారు. ఆ హోటల్ నుంచి కమిషనరేట్‌కు టీ, కాఫీలు వస్తాయి..పోలీసులే స్వయంగా ఆ హోటల్ యజమానికి అండగా ఉన్నారు' అంటూ ఆరోపించారు. 'ఒక ఏసీపీ ర్యాంకు అధికారి నాకు ఫోన్ చేసి.. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి చందా అడిగారు. అయితే మీకు నెలవారీగా వచ్చే మామూళ్లు తగ్గాయా? వాటితో ఇండ్లు కట్టుకోకుండా పోలీస్‌స్టేషన్ కట్టుకోవచ్చు కదా' అంటూ చెప్పానంటూ మండిపడ్డారు. తెలంగాణలో 9 శాతం నేరాలు పెరిగాయని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను గాలికొదిలేశారని, అసలు సామాన్య ప్రజలను కొట్టేందుకు పోలీసులకు అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. 'నేను ఇటీవల రాత్రి ఒక పెండ్లికి వెళ్లి వస్తుంటే కమిషనరేట్ కార్యాలయం ముందు 12 గంటలవుతున్నా.. ఫుల్ జనాలతో నిలోఫర్ హోటల్ నడుస్తున్నది. అదే పేదలు ఉండే ప్రాంతంలో 10 గంటలకే రోడ్లపైకి లాఠీలు పట్టుకొని టాస్క్‌ఫోర్స్ పోలీసులు వస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో లాఠీలకు పని చెబుతూ.. పగటి వేళల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిద్రపోతున్నారని, అందుకే వరుసగా హత్యలు, నేరాలు జరుగుతున్నాయంటూ.. అక్బరుద్దీన్ అసహనం వ్యక్తం చేశారు. కరుడుగట్టిన నేరస్తులపై నిఘా ఉంచాల్సిన టాస్క్‌ఫోర్స్.. నేడు ఆ విషయాన్ని మార్చిపోయి.. సామాన్యులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నదన్నారు. కాల్‌సెంటర్లు, ఐటీ, ఐటీయేతర కార్యాలయంలో రాత్రి పొద్దుపోయే వరకు పనిచేసే ఉద్యోగులు, యువత, సామాన్య ప్రజలపై పోలీసులు లాఠీలు ఝుళిపిస్తూ 10 గంటలకే దుకాణాలు మూసేయిస్తుండటంపై కోర్టులో పిల్ వేసేందుకు సిద్ధంగా ఉన్నామని, అయితే ఎమ్మెల్యేతో పాటు తమ పార్టీ శాసన సభ పక్ష నేతగా ఉన్న తాను అసెంబ్లీలో ఈ విషయంపై లేవనెత్తకుండా నేరుగా కోర్టుకు వెళ్లడం భావ్యం కాదని, అందుకే ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నానన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోకపోతే సామాన్యులకు తాను అండగా ఉంటానని.. దుకాణాలను ఎలా పోలీసులు మూసేస్తారో చూస్తానంటూ హెచ్చరించారు.




## 2వ విడతలో ఎందరికో?

### మొదటి విడతలో 2,667 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ



మేడ్చల్, జూలై 29 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా రుణమాఫీ పొందే రైతులు సుమారు 20 వేలకు పైగా ఉన్నారు. అయితే మొదటి విడతలో 2,667 మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. ఈ నేపథ్యంలో రూ. లక్ష 50 వేలు రుణమాఫీ పొందే రైతుల్లో ఆందోళన నెలకొన్నది. జిల్లాలో 9 సహకార సంఘాలు ఉన్నాయి. మొదటి విడతలో పూడూర్, ఘట్‌కేసర్, అల్వాల్ సహకార సంఘాల్లో ఆడిట్ పేరుతో ఒక్క రైతుకు కూడా మొదటి విడతలో రుణమాఫీ చేయలేదు. అంతేకాకుండా బౌరంపేట సహకార సంఘంలో 632 మంది రైతులు ఉండగా, 11 మందికి మాత్రమే రుణమాఫీ చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు. అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, డీసీసీబీ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి ఫిర్యాదు చేసినా.. ఇంత వరకు ఎలాంటి స్పందన లేదని అన్నదాతలు వాపోతున్నారు. కాగా, నేడు మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో రెండో విడతలో రైతులకు రుణమాఫీ పత్రాలను అందజేయనున్నారు. అయితే ఎంత మందికి రుణ మాఫీ చేస్తారన్నది ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి సమాచారం అందలేదని రైతులు పేర్కొంటున్నారు.

## ప్రకటనలకే పరిమితమా?

### పెండింగ్‌లోనే ప్రజా రవాణా వ్యవస్థల అనుసంధానం.. దృష్టి సారించని హెచ్ఎంఆర్ఎల్



సిటీబ్యూరో, జూలై 29 (నమస్తే తెలంగాణ):ప్రజా రవాణా వ్యవస్థల అనుసంధానం ప్రశ్నార్థకంగానే మిగిలి ఉన్నది. అత్యాధునిక ప్రజా రవాణా వ్యవస్థగా అందుబాటులోకి వచ్చిన మెట్రో రైలు కారిడార్లను ఆర్టీసీ బస్ స్టేషన్లు, రైల్వే, ఎంఎంటీఎస్ స్టేషన్లతో కలిపే ప్రక్రియ ప్రకటనలకే పరిమితమైంది. నగరంలో మెట్రో రైళ్ల రాకపోకలు ప్రారంభమై ఆరేండ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లతో అనుసంధానం చేస్తామని చెప్పిన ప్రాజెక్టులను హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) పూర్తిగా పక్కన పెట్టేసింది. అందుకు ప్రత్యేక నిదర్శనం... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తూర్పు వైపు కారిడార్-3 (నాగోల్-రాయదుర్గం)లో ఒక మెట్రో స్టేషన్ సికింద్రాబాద్ ఈస్ట్ ఉంటే, పడమర వైపు కారిడార్-2( జేబీఎస్- ఎంజీబీఎస్)లో సికింద్రాబాద్ వెస్ట్ మెట్రో స్టేషన్లు ఉన్నాయి. ఈ రెండు మెట్రో స్టేషన్లను సికింద్రాబాద్ ప్రధాన రైల్వే స్టేషన్‌తో కలిపే ఒక స్కై వాక్ నిర్మించాలని నిర్ణయించారు. దీనిపై పెద్ద ఎత్తున మెట్రో అధికారులు సర్వే చేసి, డిజైన్లు రూపొందించినా ఇప్పటికీ నిర్మాణం చేపట్టలేదు. రెండు మెట్రో కారిడార్ల నుంచి వచ్చే మెట్రో ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లోపలికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మార్గంలో నడుచుకుంటూ వెళ్తుంటే.. ట్రాఫిక్ ఇబ్బందులు ఒకవైపు, స్టేషన్ దిగిన తర్వాత సామగ్రి ఎక్కువగా ఉంటే ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలోనే స్కైవాక్ నిర్మించి ఉంటే ఇలాంటి ఇబ్బందులు ఎదురయ్యేవి కాదని మెట్రో ప్రయాణికులు వాపోతున్నారు. ఇలా ఒక్క చోటే కాదు... మూడు మెట్రో కారిడార్లలో ఉండే నాంపల్లి (హైదరాబాద్) రైల్వే స్టేషన్, కాచిగూడ రైల్వే స్టేషన్లకు ప్రత్యేకంగా మెట్రో షటిల్ సర్వీసులు ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు.

### నేటి నుంచి.. ఉదయం 5.30 గంటలకే మెట్రో

నగరంలో మెట్రో రైళ్ల రాకపోకలు మంగళవారం నుంచి ఉదయం 5.30 గంటల నుంచే మొదలుకానున్నాయి. మెట్రో రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండటంతో ప్రస్తుతం ఉన్న సమయాలను పొడిగించాలని నగరవాసులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మెట్రో రైళ్ల వేళలను పొడిగించాలని అధికారులు నిర్ణయించారు. ముఖ్యంగా సోమవారం నుంచి శుక్రవారం ఐటీ ఉద్యోగులు మెట్రోలోనే ఎక్కువగా ప్రయాణిస్తుండటంతో ప్రయోగాత్మకంగా శుక్రవారం ఉదయం 5.30 గంటల నుంచే మెట్రో రైలును నడిపారు. ఆ సమయంలో ప్రయాణికుల ఆదరణ ఉండటంతో ఇక నుంచి మూడు కారిడార్లలో టర్మినల్ స్టేషన్ల నుంచి ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచే సర్వీసులు నడుస్తాయని అధికారులు చెప్పారు.

## పార్కింగ్ పాలసీ.. ఉల్లంఘిస్తే చర్యలే

అడ్డగోలు ఫీజు వసూలుపై జీహెచ్ఎంసీ ఫోకస్

మాల్స్, మల్టీప్లెక్స్, వాణిజ్య సంస్థలపై స్పెషల్ డ్రైవ్

30 సర్కిళ్లకు.. 30 బృందాలను ఏర్పాటు చేసిన కమిషనర్




సిటీబ్యూరో, జూలై 29 (నమస్తే తెలంగాణ) : ఉచిత పార్కింగ్‌కు తిలోదకాలిచ్చే మాల్స్, మల్టీప్లెక్స్‌లు, వాణిజ్య సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి నిర్ణయించారు. మొదటి 30 నిమిషాలు ఉచితంగా పార్కింగ్, ఆ తర్వాత 30 నిమిషాల నుంచి గంట వరకు షాపింగ్ చేసిన తర్వాత రసీదు చూపిస్తేనే ఫ్రీ పార్కింగ్ వెసులుబాటు ఉంటుంది. మూడు గంటలకు ఉంటే సంబంధిత మాల్ నిబంధనల ప్రకారం చార్జీలు వసూలు చేయాలి. ఇది ఉచిత పార్కింగ్ పాలసీ అమలు లక్ష్యం. కానీ చాలా చోట్ల మాల్స్, మల్టీప్లెక్స్‌లు వంటి వాణిజ్య సంస్థల్లో అడ్డగోలు పార్కింగ్ ఫీజులను వసూలు చేస్తున్నారు. ఈ తరహా ఫిర్యాదులు జీహెచ్ఎంసీకి ఇటీవల కాలంలో ఎక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పకడ్బందీగా ఉచిత పార్కింగ్ పాలసీని అమలు చేసేందుకు సర్కిళ్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే 30 సర్కిళ్లలో 30 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక టీంలో టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్, రెవెన్యూ సెక్షన్ నుంచి ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, ఈవీడీఎం నుంచి ఒకరు, ట్రాఫిక్ పోలీస్ నుంచి సీఐ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో ఐదుగురు సభ్యులను ఏర్పాటు చేశారు. ఈ టీం థియేటర్లు, మల్టీప్లెక్స్‌లో పర్యటించి.. వాటర్ స్టాగ్‌నేషన్, ఫుడ్ కోర్టుల్లో ఎలాంటి ఆహారం అందిస్తున్నారు. ఆ బిల్డింగ్‌కు ఫైర్ సెఫ్టీ పర్మిషన్ ఉందా? లేదా చెక్ చేయడంతో పాటు ఎన్ని గజాలకు అనుమతి తీసుకుని, ఎన్ని గజాలకు ట్యాక్స్ కడుతున్నారు? ఎంత ట్రేడ్ లైసెన్స్ కడుతున్నారు? అని పరిశీలించడమే కాకుండా ప్రతి మల్టీప్లెక్స్‌లో పార్కింగ్ చేసే చోట ఎంత సేపటికి ఎంత పార్కింగ్ వసూలు చేస్తారు అని కూడా డిస్‌ప్లే చేసే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఒకవేళ నిబంధనలు పాటించకపోతే జరిమానా వేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

### జీహెచ్ఎంసీలో అంతర్గత బదిలీలు!


జీహెచ్ఎంసీలో భారీ ఎత్తున బదిలీలకు రంగం సిద్ధమైంది. ఒకే చోట నాలుగేండ్లకు పైబడి అసిస్టెంట్ మొదలు, అడిషనల్ కమిషనర్ల వరకు అన్ని విభాగాలకు సంబంధించి పెద్ద ఎత్తున బదిలీలు చేసేందుకు కసరత్తు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బదిలీల్లో భాగంగా ఇప్పటికే టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, ఎంటమాలజీ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు జీహెచ్ఎంసీ నుంచి ఇతర మున్సిపాలిటీలకు వెళ్లడం, అక్కడి నుంచి బల్దియాకు రిపోర్టు చేసేవారు. ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్ర క్యాడర్ బదిలీలు పూర్తి అయిన వెంటనే జీహెచ్ఎంసీలో అంతర్గతంగా ఉద్యోగులకు ఒక చోట నుంచి మరో చోటకు స్థాన చలనం కల్పిస్తారు. ఈ మేరకు కమిషనర్ ప్రత్యేక నివేదికను సిద్ధం చేశారు. వారం రోజుల వ్యవధిలో ఉద్యోగుల సమూల ప్రక్షాళన ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ప్రధానంగా అవినీతి, ఆరోపణలు, సుదీర్ఘ కాలం తిష్ట వేసిన ఉద్యోగులు బదిలీ కానున్నారు.

### నాలుగేండ్లకు పైబడి..

జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం పర్మినెంట్, ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ సిబ్బంది మొత్తం కలిపి 26 నుంచి 28వేల మంది ఉంటారు. 18,500 వందల శానిటేషన్ వర్కర్లు, 950 సూపర్ వైజర్లు, 500 నుంచి 800 మంది ఆపరేటర్లు, 500 మంది జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, 400 మంది సూపరింటెండెంట్లు, సుమారు 100 మంది అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, 20 మంది జాయింట్ కమిషనర్లు, 20 మంది మెడికల్ ఆఫీసర్లు, 30 మంది డిప్యూటీ కమిషనర్లు ఉన్నారు. అయితే ఎక్కువగా బదిలీల్లో నాలుగేండ్లకు పైబడి ఒకే చోట కొనసాగుతుండడం, అవినీతి ఆరోపణలు, వివాదాస్పద అధికారులకు స్థానం చలనం ఉంటుంది.

## మూసీ కాదు.. కాంగ్రెస్ ఏటీఎం

### సోషల్ మీడియాలో నెటిజన్ల విమర్శల వెల్లువ.. సుందరీకరణ అంచనా వ్యయం పెంచడంపై ఆగ్రహం



సిటీబ్యూరో: మూసీ సుందరీకరణపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వాన్ని అభాసుపాలు చేస్తోంది. రూ. 50వేల కోట్లతో లండన్‌లోని థేమ్స్ తరహాలో అభివృద్ధి చేస్తామని చెప్పిన మూడు నెలల్లోనే రూ. లక్ష కోట్లు పెంచిన నయా అంచనా వ్యయం.. కాస్తా మూసీ పేరిట కాంగ్రెస్ చేసే నయవంచనగా మారుతుందంటూ విమర్శలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డి మూసీ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టును ఏటీఎంగా మార్చుకునే ఆలోచనలు చేస్తున్నారని సోషల్ మీడియాలో నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. ఇక సామాజికవేత్తలు, పర్యావరణ నిపుణులు, రాజకీయ పార్టీలు నేరుగా ఈ ప్రాజెక్టు విషయంలో కుట్రలు ఉన్నాయంటూ కుండబద్దలు కొడుతున్నారు.'సీఎం రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే.. నగర జీవన ప్రమాణాలను పెంచేలా విద్యా, రవాణా, ఆరోగ్య సేవలను మెరుగుపరచాలి. అంతేగానీ..కార్యాచరణ లేకుండా మూసీ అంచనాలు పెంచడం వెనుక పెద్ద కుట్రనే సాగుతోంది. ' అంటూ సీనియర్ జర్నలిస్ట్ విఠల్ స్పష్టం చేస్తే.. 'మూసీ సుందరీకరణ కాదు.. మురికివాడల్లో ఉంటున్న ప్రజలకు మౌలిక వసతులను అభివృద్ధి చేసే దమ్ము ఉందా' అంటూ సీనియర్ న్యాయ నిపుణులు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ సవాల్ విసిరారు. ఇలా మూసీ సుందరీకరణ నయా అంచనాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నయవంచనపై జనాలు గొంతెత్తుతూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మూసీ విషయంలో చిత్తశుద్ధిని ప్రదర్శిస్తూ... ప్రజాధనంపై ఉన్న దాహాన్ని తగ్గించుకోవాలంటూ వ్యాఖ్యలు చేస్తుంటే.. బీజేపీ నేరుగా రేవంత్‌రెడ్డి లక్ష్యంగా ఆరోపణలు చేస్తున్నది. కాగా, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, విఠల్, సీనియర్ న్యాయ నిపుణులు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ వంటి సామాజిక బాధ్యత కలిగిన మేధావులు సీఎం రేవంత్‌రెడ్డి తీరును ప్రశ్నించారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి మూసీపై చూపుతున్న చొరవను ఎత్తిచూపుతున్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ లూటీ చేసే కుట్రలేనని వ్యాఖ్యానిస్తున్నారు. అంతగా కావాలంటే నగరంలో పడకేసిన రవాణా, విద్యా, వైద్య సేవలను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు.